సాక్షి ఏలూరు

మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024



వివాహిత దారుణ హత్య

పోలవరం మండలం కొత్త రామయ్యపేట పునరావాస కేంద్రంలో వివాహిత దారుణ హత్యకు గురైంది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. 8లో ▸



వంద పడకల ఆస్పత్రి నిర్మాణం

సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు చింతలపూడిలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణం శరవేగంగా సాగుతోంది. త్వరలో సేవలు అందుబాటులోకి రానున్నాయి. 8లో ▸

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.39 కోట్లు

ద్వారకాతిరుమల చినవెంకన్న హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 28 రోజులకు రూ.2,39,33,108 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు.



8లో

జగనన్న కాలనీల్లో కాంతులు



విద్యుత్ కాంతులీనుతున్న జగనన్న కాలనీ, (ఇన్‌సెట్) కాలనీలో విద్యుత్ స్తంభాలు

రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వందలాది ఎకరాలు సేకరించి లక్షలాది మందికి స్థలాలు అందించారు. అలాగే గృహనిర్మాణాలకు ఆర్థిక సాయం అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఓ పక్క ఇంటి నిర్మాణాలు చురుగ్గా సాగుతుండగా.. మరోపక్క కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారు. దీనిలో భాగంగా జగనన్న కాలనీల్లో విద్యుదీకరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 1,616 లేఅవుట్లకు 1,094 లేఅవుట్లలో విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి.

అభివృద్ధి వెలుగులు

- 1,094 లేఅవుట్లలో విద్యుదీకరణ పూర్తి
- 1.70 లక్షల ప్లాట్లకు రూ.148.51 కోట్ల ఖర్చు
- మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట
- సొంత స్థలాల్లో లబ్ధిదారులకూ విద్యుత్ సౌకర్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పేదలకు 1.70 లక్షలకు పైగా ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. జగనన్న కాలనీలు కొత్త ఊళ్లను తలపిస్తున్నాయి. అలాగే కాలనీలను నివాసయోగ్యంగా మలిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. కాలనీల్లో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు కల్పనకు ప్రాధాన్యం ఇస్తోంది. దీనిలో భాగంగా ప్రతి ఇంటికీ ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పిస్తూ కాలనీలన్నీ కాంతులతో మెరిసేలా చర్యలు తీసుకుంది.

1,094 లేవుట్లు.. రూ.148.51 కోట్లు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా పేదలకు 1,616 లేఅవుట్లలో ప్రభుత్వం స్థలాలు మంజూరు చేసింది. మొత్తంగా 1,70,197 మందికి ఇళ్ల మంజూరు చేసింది. జగనన్న కాలనీల్లో ఇళ్లకు విద్యుదీకరణ పూర్తి చేయడానికి విద్యుత్ శాఖ అధికారులు నిరంతరాయంగా పనులు చేస్తున్నారు. ఇప్పటికే 1,094 లేఅవుట్లలో విద్యుదీకరణ పనులు పూర్తి చేశారు. మరో 522 లేఅవుట్లలో విద్యుదీకరణ పనులు పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న తమకు విద్యుత్ సదుపాయం కల్పించడంపై లబ్ధిదారులు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఇప్పటివరకూ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో విద్యుదీకరణకు రూ.148.51 కోట్లను వెచ్చించింది.

సొంత స్థలాల్లో ఇల్లు కట్టుకున్న వారికీ..

జిల్లాలో సొంత స్థలం ఉండి అందులో ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు సైతం ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించింది. ఇలా జిల్లాలోని ఐదు డివిజన్లలో కలిపి మొత్తం 37,268 మంది గృహాలకు సంబంధించి రూ.24.28 కోట్లు ఖర్చు చేసి పూర్తిస్థాయిలో విద్యుదీకరణ పనులు పూర్తి చేశారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 2,07,465 గృహాలకు సంబంధించి విద్యుదీకరణ పనులకు రూ.172.79 కోట్ల నిధులను ఖర్చు చేయడం విశేషం.

త్వరలోనే నూరు శాతం



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జగనన్న ఇళ్ల కాలనీలకు సంబంధించి మొదటి, రెండో విడతల్లో మంజూరైన మొత్తం ఇళ్లకు విద్యుదీకరణ పనులు పూర్తి చేయడానికి మా సిబ్బంది నిరంతరాయం కృషి చేస్తున్నారు. ఇప్పటికే 1,094 లే అవుట్లలో విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి. మిగిలిన లేఅవుట్లలో పనులు వేగంగా చేపట్టాం. మార్చి నాటికి మొత్తం కాలనీలను విద్యుత్ కాంతులతో మెరిసిపోయేలా చేస్తాం. ఎక్కడా జాప్యం లేకుండా నిరంతరాయంగా పనులు చేపట్టేలా ఆదేశాలిచ్చాం.

– పి.సాల్మన్‌రాజు, ఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ ఎస్‌ఈ

1,537 ట్రాన్స్‌ఫార్మర్లు.. 39,113 స్తంభాలు

- జగనన్న కాలనీల్లో విద్యుదీకరణకు 1,537 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేశారు.
- విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా కెపాసిటీ వారీలుగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేశారు.
- ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం వారీగా 160 కేవీ 75, 100 కేవీ 461, 63 కేవీ 146, 40 కేవీ 135, 25 కేవీ 21, 156 కేవీ 682 ఉన్నాయి.
- ప్రతి ఇంటికీ విద్యుత్ లైన్ వెళ్లేలా 1616 లేఅవుట్లలో 9.1 మీటర్ల విద్యుత్ స్తంభాలు 26,912, 8 మీటర్ల విద్యుత్ స్తంభాలు 12,201 ఏర్పాటుచేశారు.
- 11 కేవీ విద్యుత్ లైన్లు 101.90 కిలోమీటర్లు, 6.3 కేవీ విద్యుత్ లైన్లు 33.67 కిలోమీటర్లు, లోటెన్షన్ 3 వైర్లు 155.84 కిలోమీటర్లు, లోటెన్షన్ 5 వైర్లు 419.89 కిలోమీటర్లు వినియోగించారు.

విద్యుదీకరణ పనులు పూర్తి

జగనన్న లేఅవుట్లు	ప్లాట్లు	వెచ్చించిన మొత్తం
1,094	1,70,197	రూ.148.51 కోట్లు

సొంత స్థలాల్లో లబ్ధిదారులు	వెచ్చించిన మొత్తం
37,268	రూ. 24.28 కోట్లు

జగనన్న కాలనీల్లో విద్యుదీకరణకు ఖర్చు

డివిజన్	లేఅవుట్లు	ప్లాట్లు	వెచ్చించిన మొత్తం (రూ.కోట్లలో)
ఏలూరు	338	53,030	32.25
జంగారెడ్డిగూడెం	198	11,623	17.59
తాడేపల్లిగూడెం	261	25,429	33.59
భీమవరం	110	20,281	14.46
నరసాపురం	375	27,217	15.04
నిడదవోలు	334	32,617	35.56



న్యూస్‌రీల్

జాతీయ లోక్ అదాలత్ తేదీ మార్పు



మేరీగ్రేస్ కుమారి, చైర్‌పర్సన్

ఏలూరు (టూటౌన్): మార్చి 9న నిర్వహించాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను మార్చి 16వ తేదీకి మార్చినట్టు శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి తెలిపారు. స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో సోమవారం ఆమె సమావేశం నిర్వహించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు లోక్ అదాలత్ తేదీని మార్పు చేశామని, న్యాయవాదులు, కక్షిదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. రోజూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం కుటుంబ వివాద కేసులో భార్యాభర్తల మధ్య రాజీ చేశామన్నారు. లోక్ అదాలత్‌ను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి టెట్ పరీక్షలు



మాట్లాడుతున్న ఏడీ నరసింహారావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మంగళవారం నుంచి టెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగే చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ అదనపు డైరెక్టర్, టెట్ పరీక్షల జిల్లా పరిశీలకుడు ఆర్.నరసింహారావు సూచించారు. సోమవారం టెట్ పరీక్షలకు సంబంధించి డిపార్ట్‌మెంటల్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లకు స్థానిక డీఈఓ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ అక్రమాలు, మాల్‌ప్రాక్టీస్‌లకు తావులేకుండా పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అభ్యర్థులను ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించమని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో గాలి, వెలుతురు సక్రమంగా ఉండేలా చూడాలని, అభ్యర్థులకు తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. డీఈఓ ఎస్.అబ్రహం, అధికారులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాక

ఏలూరు (టూటౌన్): ఏలూరు ఇండోర్ స్టేడియంలో మంగళవారం జరిగే జోన్–2 బీజేపీ బూత్‌స్థాయి కార్యకర్తల సమ్మేళనానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరుకానున్నారు. ఏలూరు, నరసాపురం, రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ పార్లమెంటు స్థానాల పరిధిలో ఈ సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీఎస్ఆర్ చౌదరి సోమవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కేంద్ర రక్షణ మంత్రి పర్యటనకు ఎటువంటి అవాంతరాలూ లేకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్టు ఆయన చెప్పారు.

ప్రతి శుక్రవారం వినతుల స్వీకరణ

ఏలూరు(మెట్రో): జిల్లాలో సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆయా శాఖల అధికారులు కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం సర్క్యులర్ జారీ చేశారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని, నివేదికను ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో సమర్పించాలని ఆదేశించారు. సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

గూడెం మున్సిపాలిటీకి జాతీయ పురస్కారం



మాట్లాడుతున్న కమిషనర్ శామ్యూల్

తాడేపల్లిగూడెం/తాడేపల్లిగూడెం అర్బన్: పారిశుధ్య నిర్వహణలో తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ జాతీయ స్థాయిలో 16వ స్థానం, రాష్ట్రస్థాయిలో రెండో స్థానం పొందింది. ఈ మేరకు జాతీయ పురస్కారానికి ఎంపికైంది. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎ.శామ్యూల్ మాట్లాడుతూ పురస్కారానికి ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా అంశాలపై ఢిల్లీ నుంచి వచ్చిన తేజస్ సర్వే బృందం పట్టణంలో పర్యటించిందన్నారు. ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారన్నారు. వచ్చేనెల 5న అవార్డు తీసుకుంటామని, తాను, ఎంఈ మురళీకృష్ణ, పారిశుద్ధ్య విభాగ అధికారులు చిదంబరం శ్రీనివాసు, కొల్లా అఖిల్, శ్రీమన్నారాయణ, అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు ఢిల్లీ వెళుతున్నట్టు చెప్పారు. మున్సిపల్ పారిశుద్ధ్య అధికారులు, మేస్త్రీలు, సచివాలయ ఎమినిటీ సెక్రటరీలు, 298 మంది పారిశుద్ధ్య కార్మికులు, ఇంజనీరింగ్ విభాగ అధికారులు, సిబ్బంది కృషి ఉందన్నారు. అలాగే సీఎం జగన్, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ సహాయ, సహకారాలు, ప్రోత్సాహం ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళికా అధికారి హరిప్రసాద్, రెవెన్యూ అధికారి రవికుమార్, సోమేశ్వరరావు, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీవైఈఓగా శ్రీరామ్



డీఈఓ అబ్రహంను కలిసిన డీవైఈఓ శ్రీరామ్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు ఉప విద్యాశాఖాధికారిగా (ఇన్‌చార్జి) డి.శ్రీరామ్ నియమితులయ్యారు. ఇప్పటివరకూ ఏలూరు డీవైఈఓగా పనిచేసిన ఎన్‌వీ రవిసాగర్ పదోన్నతిపై అనంతపురం జిల్లా బుక్కపట్నం డైట్ ప్రిన్స్‌పాల్‌గా నియమితులు కావడంతో ఆ స్థానం ఖాళీ అయ్యింది. దీంతో ఆ స్థానంలో ప్రస్తుతం భీమవరం ఉప విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న డి.శ్రీరామ్‌ను ఏలూరు ఇన్‌చార్జి డీవైఈఓగా నియమించారు. శ్రీరామ్ సోమవారం ఏలూరులో బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహంను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

నడుస్తున్న బైక్ నుంచి మంటలు



రోడ్డుపై కాలిపోతున్న వాహనం

ద్వారకాతిరుమల: రోడ్డుపై వెళుతున్న బైక్ నుంచి అకస్మాత్తుగా మంటలు వచ్చి దగ్ధమైన సంఘటన గుండుగొలనుకుంటలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం కామవరపుకోట మండలం వడ్లపల్లికి చెందిన రామిశెట్టి హరీష్ తన బైక్‌పై ద్వారకాతిరుమల నుంచి స్వగ్రామానికి వెళుతున్నాడు. మార్గమధ్యలో గుండుగొలనుకుంట వచ్చేసరికి బైక్ బ్యాటరీ వద్ద షార్ట్ సర్క్యూట్‌తో మంటలు రేగాయి. దీంతో హరీష్ బైక్ నుంచి దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. మంటలను ఆర్పేందుకు అతడు ఎంత ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. కొద్ది నిమిషాల్లోనే బైక్ పూర్తిగా దగ్ధమైంది.

ఉచిత ప్రయాణం

భీమవరం (ప్రకాశంచౌక్): టెన్త్ పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వీరయ్యచౌదరి ప్రకటనలో తెలిపారు. పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణించవచ్చన్నారు.

స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



వృద్ధుడి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపడంతో పాటు సకాలంలో అర్జీలను పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేయాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డీఆర్‌ఓ పుష్పమణి, హౌసింగ్ పీడీ కె.రవికుమార్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, సమగ్ర శిక్ష అభియాన్ పీఓ బి.సోమశేఖర్, ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలితో కలిసి ఆయన అర్జీలు స్వీకరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి 218 అర్జీలు అందాయన్నారు. వీటిని పెండింగ్ లేకుండా గడువులోపు పరిష్కారం చూపాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత పరిష్కార విధానంపై ప్రజలు సంతృప్తి చెందని కారణంగా దరఖాస్తులు రీఓపెన్ అవుతాయన్నాయని, రీఓపెన్ కాని రీతిలో పరిష్కారం చూపాలన్నారు.

అర్జీల్లో కొన్ని..

- కొయ్యలగూడెం మండలం పొంగుటూరుకు చెందిన నాగేశ్వరరావు తమ భూమిని రీ సర్వే చేయించి హద్దులు కేటాయించాలని అర్జీ అందజేశారు.
- చింతలపూడి మండలానికి చెందిన వెంకటేశ్వరరావు తమ భూమి వివరాలు ఆన్‌లైన్ కావడం లేదని, చర్యలు తీసుకోవాలని కోరారు.
- భోగాపురానికి చెందిన నవ్య జగనన్న కాలనీలో తమ ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తమ పేరు కనిపించడం లేదని వినతిపత్రం అందజేశారు.
- బుట్టాయగూడెం మండలం బండార్లగూడెంకు చెందిన రాంబాబు తమ భూమిని గంగరాజు అనే వ్యక్తి ఆక్రమించాడని విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.

2008 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు



ఎంటీఎస్ టీచర్‌గా నియామక పత్రం అందిస్తున్న ఏడీ నరసింహారావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): 2008 డీఎస్సీలో అర్హత సాధించి ఉద్యోగాలు పొందని పలువురు అభ్యర్థులకు మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) ప్రాతిపదికన ఉద్యోగాల్లో నియమిస్తూ సోమవారం డీఈఓ సి.అబ్రహం నియామక పత్రాలు అందించారు. 2021 జూలైలో కొందరిని ఉద్యోగాల్లో నియమించగా, అప్పట్లో పలు కారణాలతో ఉద్యోగాలు పొందలేకపోయిన మరో 18 మంది అర్హులకు నియామక పత్రాలు అందించే కార్యక్రమం చేపట్టారు. ఇద్దరు అభ్యర్థులు గైర్హాజరు కాగా మిగిలిన 16 మందికి పాఠశాల విద్యాశాఖ అదనపు డైరెక్టర్ ఆర్.నరసింహారావు చేతులమీదుగా నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా జగన్ బాధ్యతలు తీసుకున్న అనంతరం గత డీఎస్సీల్లో అర్హులైన అభ్యర్థులకు సైతం ఎంటీఎస్ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలిచ్చి వారి కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. ఇలా జిల్లాలో సుమారు 600 మంది అభ్యర్థులకు ఉపాధ్యాయ ఉద్యోగాలిచ్చారన్నారు.

28న రీజనల్ జాబ్ మేళా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 28న రీజనల్ జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరంలోని మార్గాని ఎస్టేట్‌లో జాబ్ మేళాలో ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాలకు చెందిన నిరుద్యోగులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. సుమారు 100కు పైగా కంపెనీల్లో దాదాపు 5 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తారని తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్హతలు కలిగి 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు సెల్ 9666322032, 9652503799 లేదా టోల్ ఫ్రీ నంబర్ 9988853335లో సంప్రదించాలని కోరారు. అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత, ఇతర సర్టిఫికెట్లు ఒరిజినల్, జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని సూచించారు.

క్లుప్తంగా

మిథున్‌రెడ్డిని కలిసిన జెట్టి



మిథున్‌రెడ్డిని మర్యాపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేస్తున్న జెట్టి గురునాథరావు

జంగారెడ్డిగూడెం: ఇటీవలే కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మెట్ట ప్రాంత సీనియర్ రాజకీయ నాయకులు జెట్టి గురునాథరావు సోమవారం విజయవాడలో వైఎస్సార్‌సీపీ ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్, పార్లమెంటు సభ్యులు మిథున్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్కను అందజేశారు. అలాగే రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలుసుకుని పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కొద్దిసేపు ఏజెన్సీ, మెట్ట ప్రాంతంలోని రాజకీయ పరిస్థితులను కొద్దిసేపు వారితో చర్చించారు. కాగా, జెట్టి గురునాథరావు మాట్లాడుతూ తాను, తన క్యాడర్ భవిష్యత్తు కార్యాచరణను త్వరలో ప్రకటిస్తానని తెలియజేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.39 కోట్లు

29 రోజులకు వచ్చిన రాబడి



హుండీల నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ హుండీల లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో సోమవారం అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ జరిగింది. ఈ లెక్కింపులో చినవెంకన్నకు విశేష ఆదాయం సమకూరింది. గడచిన 28 రోజులకు గాను నగదు రూపేణా స్వామి వారికి రూ.2,39,33,108 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు చెప్పారు. అలాగే కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 424 గ్రాముల బంగారం, 5.674 కేజీల వెండితో పాటు, అధికంగా విదేశీ కరెన్సీ లభించిందన్నారు. అదేవిధంగా లెక్కింపులోకి రాని రద్దు అయిన పాత రూ.2వేలు, రూ.వెయ్యి, రూ.500 నోట్ల రూపంలో రూ.43 వేలు లభించినట్టు చెప్పారు. ఈ లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వంద పడకల సాకారం

- సీఎం జగన్ హామీతో నెరవేరిన మెట్ట ప్రాంతవాసుల కల
- చింతలపూడికి 100 పడకల ఆసుపత్రి మంజూరు.. చురుగ్గా నిర్మాణం
- త్వరలో అందుబాటులోకి మెరుగైన వైద్య సేవలు
- రూ.11 కోట్లతో గ్రామాల్లోనూ 61 హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం

మెట్టప్రాంత వాసులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న దశాబ్దాల నాటి కల ఎట్టకేలకు సాకారం కానుంది. చింతలపూడిలో వంద పడకల ఆస్పత్రి సేవలు త్వరలో అందుబాటులోకి రానుండటంతో నియోజకవర్గ ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే చింతలపూడికి వంద పడకల ఆస్పత్రిని మంజూరు చేయడమే కాక రూ.25 కోట్ల నిధులను కేటాయించారు. ప్రస్తుతం ఆస్పత్రి నిర్మాణం చురుగ్గా సాగుతుండగా, త్వరలోనే మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.



చింతలపూడిలో 30 పడకల ఆసుపత్రి



చింతలపూడిలో శరవేగంగా నిర్మాణం జరుపుకుంటున్న 100 పడకల ఆసుపత్రి



చింతలపూడి మండలం రేచర్లలో హెల్త్ క్లినిక్

చింతలపూడి : చింతలపూడి నియోజకవర్గానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చడంతో నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే చింతలపూడికి 100 పడకల ఆసుపత్రిని మంజూరు చేసి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాటను సీఎం వైఎస్ జగన్ నిలబెట్టుకున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఉన్న పీహెచ్‌సీలకు తోడు ప్రతి సచివాలయం పరిధిలో రూ.లక్షలు వెచ్చించి హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడమే వాటికి శాశ్వత భవనాలు నిర్మిస్తుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం పేదలకు అందుబాటులోకి వచ్చింది. నియోజకవర్గంలో రూ.11.22 కోట్ల వ్యయంతో 61 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చింతలపూడి పట్టణంలో 30 పడకల ఆసుపత్రి అందుబాటులో ఉంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికీకరించడంతో పాటు డాక్టర్ల కొరత, మందుల కొరతను తీర్చారు. అదేవిధంగా జంగారెడ్డిగూడెం పట్టణంలో మహానేత వైఎస్సార్ మంజూరు చేసిన నూరు పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయ్యి ప్రజలకు వైద్య సేవలు అందిస్తోంది.

రూ.25 కోట్లతో నిర్మాణం..

చింతలపూడి నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తి కావొచ్చాయి. ఐదు బ్లాకులుగా అత్యంత భారీగా భవనాలను నిర్మిస్తున్నారు. 100 పడకలతో పాటు, అత్యాధునిక వైద్య పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. ఈ భవనాల నిర్మాణం పూర్తయితే అన్ని రకాల వైద్య సదుపాయాలతో పాటు నిపుణులైన వైద్యులు, నర్సింగ్ స్టాఫ్, సపోర్టింగ్ స్టాఫ్, వైద్య పరీక్షల కోసం ఆధునిక ల్యాబ్ అందుబాటులోకి రానున్నాయి. ఎన్నికల ప్రచారానికి వచ్చిన సందర్భంలో మెట్ట ప్రాంతంలో నూరు పడకల ఆసుపత్రి ఆవశ్యకతను ఇక్కడి నేతలు వైఎస్ జగన్‌కు వివరించారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక చింతలపూడికి నూరు పడకల ఆసుపత్రిని మంజూరు చేస్తామని అప్పుడే హామీ ఇచ్చారు. అనంతరం వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే ఆస్పత్రి మంజూరు చేసి నిర్మాణానికి రూ.25 కోట్ల నిధులను కేటాయించారు. తొలిదశలో ప్రభుత్వం రూ.2.50 కోట్లు ఇటీవల విడుదల చేసింది. 2020 నవంబర్ 19న అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

టీడీపీ హయాంలో..

2011లో చింతలపూడిలో వంద పడకల ఆసుపత్రికి అప్పటి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం రూ.5.44 కోట్ల నిధులను మంజూరు చేసింది. 2012 సెప్టెంబర్ 30న అప్పటి ఎమ్మెల్యే మద్దాల రాజేష్‌కుమార్ ఆసుపత్రి నిర్మాణానికి స్థానిక ప్రభుత్వ ఐటీఐ సమీపంలో భూమిపూజ చేశారు. అనంతరం 2013 డిసెంబర్ 17న అప్పటి కేంద్ర జౌళిశాఖ మంత్రి కావూరు సాంబశివరావు శంకుస్థాపన చేశారు. కానీ ఆసుపత్రి నిర్మాణం ప్రారంభం కాలేదు. గత టీడీపీ హయాంలో నూరు పడకల ఆసుపత్రిని పక్కన పెట్టి ఉన్న 30 పడకల ఆసుపత్రినే రూ.80 లక్షలతో ఆధునికీకరించారు. ఈ ఆసుపత్రిని ఆధునీకరించినా ఉపయోగం ఉండదని, 100 పడకలకు విస్తరిస్తేనే డాక్టర్ల కొరతతో పాటు మందులు, సిబ్బంది కొరత కూడ తీరుతుందని నియోజకవర్గ ప్రజలు నెత్తీనోరూ బాదుకున్నా తెలుగుదేశం పాలకులకు పట్టలేదు. లింగపాలెం, కామవరపుకోట, టి.నర్సాపురం, చింతలపూడి మండలాల నుండే కాక కృష్ణా జిల్లా, ఖమ్మం జిల్లాల నుంచి కూడా నిత్యం 300 నుంచి 400 మంది రోగులు ఈ ఆసుపత్రికి వైద్యం నిమిత్తం వస్తుంటారు. గత కొద్ది సంవత్సరాలుగా వైద్యుల కొరతతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ నూరు పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే వైద్యపరంగా ఈ ప్రాంతం అభివృద్ధి సాధిస్తుందనడంలో సందేహం లేదు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



చింతలపూడికి 100 పడకల ఆసుపత్రి మంజూరు చేసి నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు నియోజకవర్గ ప్రజలు రుణపడి ఉంటారు. ప్రస్తుతం ఆసుపత్రి నిర్మాణం వేగంగా జరుగుతోంది. ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుంది.

– కంభం విజయరాజు, వైఎస్సార్ సీపీ చింతలపూడి ఇన్‌చార్జి

వైద్యసేవలు మెరుగుపడతాయి



చింతలపూడిలో నూరు పడకల ఆసుపత్రి నిర్మాణంతో చుట్టుపక్కల ప్రజలకు వైద్యసేవలు మెరుగుపడతాయి. గ్రామాల్లో నిరుపేదలకు జబ్బు చేస్తే మంచి వైద్యం కోసం వ్యయ ప్రయాసలకోర్చి సత్తుపల్లి, ఖమ్మం వెళ్లాల్సి వస్తోంది. చింతలపూడిలో అన్ని సౌకర్యాలతో అధునాతన ఆసుపత్రి నిర్మాణం చేపట్టిన సీఎం జగన్‌కు కతజ్ఞతలు.

– తాండ్ర రామకష్ణారావు, సర్పంచ్, చింతంపల్లి

సెంట్రల్ జోన్ క్రికెట్ టోర్నీ ఫైనల్స్‌కు 'సీఆర్‌ఆర్'

కంచికచర్లలో ఆసక్తికరంగా పోటీలు, నేడు ఫైనల్ మ్యాచ్



కంచికచర్లలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కళాశాల ప్రిన్సిపాల్ వంశీకిరణ్, శౌరయ్య

కంచికచర్ల : కంచికచర్లలోని మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో జేఎన్‌టీయూ కాకినాడ సెంట్రల్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్‌లో వీఆర్ సిద్దార్థ (కానూరు), సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల (ఏలూరు) జట్లు పోటీ పడనున్నట్లు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నిమ్మగడ్డ శౌరయ్య సోమవారం చెప్పారు. సెమీ ఫైనల్స్‌లో వీఆర్ సిద్ధార్థ (కానూరు), విష్ణు ఇంజినీరింగ్ కాలేజీ (భీమవరం) జట్లు తలపడ్డాయి. ముందుగా కళాశాల మెకానికల్ హెచ్‌ఓడీ డాక్టర్ శివారెడ్డి టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. టాస్ గెలిచిన విష్ణు కాలేజీ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 109 పరుగులు మాత్రమే చేయగలిగింది. వీఆర్ సిద్ధార్థ బౌలర్ సృజన్ 4 ఓవర్లు వేసి 18 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టి బ్యాట్స్‌మెన్‌లను కట్టడి చేశారు. ఆ తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన వీఆర్ సిద్ధార్థ జట్టు 17 ఓవర్లకే 110 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. బ్యాట్స్‌మెన్ శశిధర్ 30 పరుగులు చేసి జట్టు విజయానికి తోడ్పడ్డాడు. దీంతో జట్టు ఫైనల్స్‌కు చేరింది. రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ ఎస్ఆర్‌ఐ ఇంజినీరింగ్ కళాశాల (ఆగిరిపల్లి), సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల (ఏలూరు) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన సీఆర్ రెడ్డి జట్టు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 118 పరుగులు సాధించింది. జట్టు సభ్యుడు సంజయ్ 40 పరుగులు తీశాడు. ఆ తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన ఎస్ఆర్‌ఐ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 105 పరుగులు మాత్రమే చేసింది. దీంతో సీఆర్ రెడ్డి జట్టు 13 పరుగుల తేడాతో విజయం సాధించింది. మంగళవారం ఫైనల్ మ్యాచ్ వీఆర్ సిద్ధార్థ, సీఆర్ రెడ్డి జట్ల మధ్య జరుగుతుందని శౌరయ్య తెలిపారు.

వివాహిత దారుణ హత్య

- కత్తితో గొంతు కోసిన దుండగులు
- కొత్త రామయ్యపేటలో ఘటన
- వెలుగులోకి రాని హత్యకు కారణం



మేడూరి దుర్గ (ఫైల్)



కొత్తరామయ్యపేటలో దుర్గ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పోలవరం రూరల్ : మండలంలోని కొత్త రామయ్యపేట పునరావాస కేంద్రంలో ఆదివారం రాత్రి ఓ వివాహిత దారుణ హత్యకు గురైంది. ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆమెపై కత్తితో దాడి చేయడంతో కంఠం తెగి తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మేడూరి దుర్గ (38) భర్త, కుమారుడు ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి 9 గంటలకు తిరిగి వచ్చేసరికి దుర్గ ఇంటి బయట ఆవరణలో పడి ఉండటాన్ని వారు గమనించారు. ఎంతకూ కదలకపోవడంతో కుమారుడు అమ్మా అని పిలుస్తూ ఆమెను పక్కకు తిప్పేసరికి రక్తపు మడుగులో మృతి చెంది ఉన్నట్లు గుర్తించాడు. ఇరుగు పొరుగువారికి పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ సురేష్‌కుమార్ రెడ్డి, సీఐ మధుబాబు, ఎస్సై పవన్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీమ్‌ను రప్పించి ఆ ప్రాంతంలో నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఇంటి పక్కనే ఉన్న మామిడి తోట నుంచి నిందితులు పరారైనట్లు భావిస్తున్నారు. మహిళ హత్యతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఇంట్లో బీరువాలో ఉన్న రూ.50 వేలు నగదు, మృతురాలిపై ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు అలాగే ఉండటంతో చోరీ కోసం ఈ హత్య జరగలేదని పోలీసులు భావిస్తున్నారు. దీంతో హత్యకు గల కారణాలపై పోలీసులు పలు కోణాల్లో విచారణ చేస్తున్నారు. దుర్గ బంటా మేస్త్రిగా పనిచేస్తుండగా, హత్యకు ముందు మహిళ ఫోన్‌లో ఎవరెవరితో మాట్లాడారు అనే విషయాలను పరిశీలిస్తున్నారు. డీఎస్పీ సురేష్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఘటనా స్థలానికి వెళ్లి హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించామని, హత్యకు గల కారణాలపై సీఐ మధుబాబు ఆధ్వర్యంలో ఎస్సై పవన్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారన్నారు. త్వరలో నిందితుడిని పట్టుకుంటామన్నారు. మృతదేహాన్ని పోలవరం వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్సై పవన్ కుమార్ చెప్పారు.


అపరిచితుల లింక్, మెస్సేజ్‌లు ఓపెన్ చేయవద్దు



స్పందనలో అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ డి.మేరీప్రశాంతి

ఏలూరు (టూటౌన్): సోషల్ మీడియాలో అపరిచితులు పంపించే లింక్‌లు, మెసేజ్‌లను ఓపెన్ చేయవద్దని జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి కోరారు. ఏలూరులోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె ఫిర్యాదుదారుల నుంచి వినతులను స్వీకరించారు. సమస్యలపై అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా అనేక మోసాలు జరుగుతున్నాయని గుర్తు చేశారు. మీ బ్యాంక్ అకౌంట్‌లో తప్పుగా మనీ ట్రాన్స్‌ఫర్ చేశామని, సదరు డబ్బులను వెనక్కి పంపించాలని ప్రాధేయపడుతూ ఓటీపీ నంబర్‌ను తెలియజేయాలని చెప్పే మోసగాళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఓటీపీతో బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న డబ్బులను తస్కరిస్తారని హెచ్చరించారు. స్పందనలో మొత్తం 50 ఫిర్యాదులు రాగా ఎక్కువగా వాటిలో వరకట్న వేధింపులు, సరిహద్దుల గొడవలు, సివిల్ వివాదాలపై ఫిర్యాదులు ఉన్నాయన్నారు. వీటిని సత్వరమే చట్ట ప్రకారం పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు.

తెలంగాణ మద్యం పట్టివేత



మద్యం సీసాలతో పట్టుబడ్డ మహిళతో సెబ్ అధికారులు

నూజివీడు: చాట్రాయి మండలం పోలవరంలో ఓ మహిళను అరెస్టు చేసి తెలంగాణ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ నూజివీడు ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ సోమవారం చెప్పారు. పోలవరంలో తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడిలో గ్రామానికి చెందిన లింగాల సుజాతను అదుపులోకి తీసుకుని, ఆమె నుంచి మాన్షన్‌హౌస్ (180ఎంఎల్) సీసాలు 16, కింగ్‌ఫిషర్ స్ట్రాంగ్ బీర్ (650 ఎంఎల్) సీసాలు 12 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితురాలిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు.

'ప్రైవేట్'లో ఉచిత విద్యకు దరఖాస్తు గడువు పెంపు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం అనుసరించి 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి మార్చి 25వ తేదీ వరకు గడువు పెంచినట్లు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బి.సోమశేఖరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు మార్చి 25వ తేదీ లోగా సీఎస్ఈ ఏపీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వివాహ మధ్యవర్తుల కార్పొరేషన్ కావాలి


- ఆంధ్రరాష్ట్ర ఐక్యత వివాహ మధ్యవర్తుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పీ శోభారాణి
- ఏలూరులో సంఘం రాష్ట్ర నూతన కమిటీ ఏర్పాటు



ప్రమాణ స్వీకారం చేసిన సంఘం నూతన కమిటీ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలోని వివాహ మధ్యవర్తుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, వారి సంక్షేమానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఆంధ్ర రాష్ట్ర ఐక్యత వివాహ మధ్యవర్తుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు పి.శోభారాణి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో సంఘం రాష్ట్ర నూతన కమిటీ మహాజన సమావేశం సంఘ కార్యదర్శి చిత్తుమూరి రత్నరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ రాష్ట్రంలోని వివాహ మధ్యవర్తులు దేశ, విదేశాల్లో వివాహాలకు మధ్యవర్తులుగా ఉన్నా, వారికి తగిన రక్షణ, ప్రోత్సాహం, ఆర్థిక రక్షణ లేదన్నారు. ప్రభుత్వం తమను గుర్తించి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వివాహ మధ్యవర్తుల పారితోషికం చట్టబద్ధత చేయాలన్నారు. పారితోషికం ఎగవేతదారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి చట్టబద్ధత కల్పించాలని కోరారు. వివాహ మధ్య వర్తులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అత్తిలి శ్రీనివాసరావు, కార్యదర్శి చిట్టిమూరి రత్నరాజు, సంయుక్త కార్యదర్శి వేముల సూర్యనారాయణ మాట్లాడారు. అనంతరం రాష్ట్ర నూతన కమిటీ అధ్యక్షురాలిగా పీ శోభారాణి, ఉపాధ్యక్షులుగా అత్తిలి శ్రీనివాసరావు, కార్యదర్శిగా చిట్టిమూరి రత్నరాజు, సంయుక్త కార్యదర్శిగా వేముల సూర్యనారాయణ, కోశాధికారిగా గంగాధరరావు, కార్యవర్గ సభ్యులుగా తలమాల యిర్మీయ, రత్నాకరం రామరాజు, మహ్మద్ అలీ ప్రమాణ స్వీకారం చేశారు.

యువతి కడుపులో 5 కేజీల కణితి తొలగింపు



శస్త్రచికిత్స చేసి తొలగించిన కణితి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను సోమవారం నిర్వహించారు. యువతి కడుపులో పెరుగుతున్న సుమారు ఐదు కేజీల కణితిని శస్త్రచికిత్స చేసి తొలగించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జీలుగుమిల్లి మండలం స్వర్ణవారిగూడెంకి చెందిన స్వప్న అనే యువతి కడుపునొప్పి బాధతో జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చింది. వైద్యులు ఆమెను పరీక్షించి టెస్ట్‌లు చేశారు. దీనిలో ఆమె కడుపులో కణితి పెరుగుతోందని గుర్తించారు. సోమవారం ఆసుపత్రి వైద్యులతో కలిసి శస్త్రచికిత్స చేసి కణితి తొలగించారు. ప్రస్తుతం స్వప్న ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్ బేబీ కమల చెప్పారు.

ఐకమత్యంతోనే రజకుల అభివృద్ధి



మహాసభలో మాట్లాడుతున్న చిలకలపల్లి కట్లయ్య

ఏలూరు (టూటౌన్): రజకులు సామాజిక, ఆర్థిక, రాజకీయంగా అభివృద్ధి సాధించాలంటే ఐక్యంగా ముందుకు సాగాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన సంఘం జిల్లా అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య పిలుపునిచ్చారు. స్థానిక ఏటిగట్టు ప్రాంతంలోని సంఘం జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన రజక జన మహాసభలో ఆయన మాట్లాడారు. రజకుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఎన్ని జీవోలు విడుదల చేసినప్పటికీ పంచాయతీల అవగాహనా రాహిత్యం వల్ల అమలుకు నోచుకోడం లేదన్నారు. రజకులు వృత్తిపరమైన సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో రజకులకు ప్రాధాన్యత కల్పించాల్సిందిగా ఆయన రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. చట్టసభల్లో రజకుల గొంతు వినిపించేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. ఉమ్మడి జిల్లా రజక సీనియర్ నాయకులు పరిటాల శ్రీనివాసరావు, పగడాల సాంబశివరావు, జుజ్జువరపు శ్రీనివాసరావు మాట్లాడారు. కొమ్మంటి మురళీ, భీమవరపు మహంకాళి, చింతాడ శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, కడెల్లి సుబ్బయ్య, పున్నపు నరసింహారావు, ఎలమంచిలి నాగేషు, కోటి చుక్కల నాగ శేషు, లక్ష్మీ ప్రసన్న, అవిడి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.